manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel


సంపుటి : 01 | సంచిక : 251 | శనివారం | 29.03.2025



2 లో

## ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్
# స్పీడప్ చేయాలి

- బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణమే చెల్లింపులు
- ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య రావొద్దు
- జూన్ చివరి నాటికి వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు పూర్తికావాలి
- మడికొండ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం
- వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

3 లో

## అన్ని మతాలకు సమప్రాధాన్యం

- ఇఫ్తార్ వేడుకల్లో ఎమ్మెల్యే కడియం

3





## అండర్ పాస్ పోరాటానికి ఎస్‌ఎఫ్‌ఐ మద్దతు

3

General News



# ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ స్పీడప్ చేయాలి

- బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణమే చెల్లింపులు
- తాగునీటి సమస్య రావొద్దు
- జూన్ చివరి నాటికి వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు పూర్తికావాలి
- మడికొండ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం
- వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, మన చౌరాస్తా :-**

పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని , బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణం చెల్లింపులు జరపాలని వరంగల్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వరంగల్ స్మార్ట్ సిటీ పనులు , వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, తాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు తదితర అంశాలపై పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, అటవీ , దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా శాసనసభ్యులు, కలెక్టర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతా అంశమని, దీనిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్లు పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రభుత్వం నాలుగు విడతలలో చెల్లింపులు చేస్తుందని, మొదటి విడతలో బేస్ మెంట్ లెవెల్ పూర్తయిన ఇండ్లకు లక్ష రూపాయిలు ఇస్తుందని, బేస్ మెంట్ పూర్తయిన ఇండ్ల వివరాలను హౌసింగ్ విభాగానికి పంపిస్తే తక్షణమే చెల్లింపులు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఇండ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్దిదారులకు ఇప్పటివరకు కేటాయించని 2 బిహెచ్‌కే ఇండ్లను కేటాయించాలని అలాగే మొండి గోడలతో ఉన్న ఇండ్లను పూర్తిచేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రాని పక్షంలో లబ్దిదారులే ఆ ఇండ్లను పూర్తిచేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని లబ్దిదారులను ఎంపిక చేసి ఇండ్లను కేటాయించాలని సూచించారు.

వేసవి కాలంలో ఏ గ్రామంలో, పట్టణంలోగానీ తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా జిల్లా కలెక్టర్లు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని అధికారులు వారంలో మూడు రోజులు గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. వచ్చే మూడు నెలలు చాలా కీలకమని ప్రజలకు ఎక్కడ తాగునీటి గురించి ఇబ్బంది కలగకుండా నీళ్లు రావడం లేదన్న విమర్శ రాకుండా పనిచేయాలన్నారు. నీటికొరత ఉన్న ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా త్రాగు నీరు సరఫరా చేయడం, చెడిపోయిన బోర్లు, హ్యాండ్ పంప్ లను తక్షణం మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తిచేసి ఆ తర్వాత మరో నెలరోజుల్లో వైద్య



సేవలకు అవసరమైన పరికరాలను అమర్చి జూన్ చివరి నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

మడికొండ డంపింగ్ యార్డు సమస్యకు వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపించి ఆ తర్వాత శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దీనికి సంబంధించి సిడిఎంఎ డైరెక్టర్ శ్రీదేవిని స్వయంగా అక్కడ పర్యటించి పరిష్కార మార్గాలను సూచించాలని ఆదేశించారు. వరంగల్, కరీంనగర్ రహదారి ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డు కోసం 150 నుంచి 200 ఎకరాల భూమిని సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. వరంగల్ భద్రకాళి చెరువు పూడికతీత పనులను ఎట్టి పరిస్థితులలోను వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పూర్తిచేయాలన్నారు. వరంగల్ స్మార్ట్ సిటీ పనుల విషయంలో అధికారులు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో శాసన సభ్యులు కడియం శ్రీహరి, నాయని రాజేందర్, యశస్విని రెడ్డి, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, మురళీనాయక్, రామచంద్ర నాయక్, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ఆర్ అండ్ బి సెక్రెటరీ హరిచందన, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులపై దాడులు ఆపాలి

**రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా చందునాయక్**

**జనగామ, మన చౌరాస్తా :** ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై చేస్తున్న దాడులు, నిర్బంధాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం వెంటనే ఆపాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ డిమాండ్ చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై చేసిన దాడులకు నిరసనగా జనగామ జిల్లా కేంద్రంలో చౌరస్తా వద్ద సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భూక్యా చందు నాయక్ కేంద్ర ప్రభుత్వం గతంలో దేశ రైతాంగానికి ఇచ్చిన రాత పూర్వక హామీలను అమలు చేయాలని, రెండో దశ ఉద్యమం చేస్తున్న పంజాబ్, హర్యానా రైతులను సరిహద్దుల్లో నిలువరించి విదేశీ ఉగ్రవాదులతో ప్రయోగించే ఆధునిక పద్ధతిలో రైతులపై దాడులు చేయడం భారత సమాజం ఖండించాలని కోరారు. గతంలో రైతుల చర్చల్లో ఒప్పందం చేసుకొని అమలు చేయకపోవడంతో రైతులు తిరిగి రెండో దశ ఉద్యమం ప్రారంభించారన్నారు. అదేవిధంగా రైతులు పండించే అన్ని రకాల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం గిట్టుబాటు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, దేశవ్యాప్తంగా రైతు రుణాలన్నింటిని ఏకకాలంలో మాఫీ చేయాలని కిసాన్ సంబంధించిన పథకానికి సంవత్సరానికి రూ.20 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జిల్లా భాద్యులు కుర్ర రవీందర్ గౌడ్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంగ బీరయ్య, జిల్లా సహాయ కార్యదర్శి రామావత్ మీట్యా నాయక్, పట్టణ అధ్యక్షులు ఉర్సుల కుమార్, మంద్రా బండయ్య, కర్రె సత్యనారాయణ, కర్రె సిద్దిమల్లయ్య, నీలం బాలరాజు, సులోచన, సోని పాల్గొన్నారు.



## తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా కేంద్రంలోని శ్రీ హనుమత్ రామనాథ సహిత శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, జ్యోతిష్య పండితులు, రచయిత డాక్టర్ ఎక్కలదేవి మోహనకృష్ణ భార్గవ రచించి, ప్రచురించిన ఉగాది తెలుగు కాలసూచిక (క్యాలెండర్) శుక్రవారం పలువురు ప్రముఖులు, భక్తుల సమక్షంలో వైభవంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా సత్సాంప్రదాయక తెలుగు కాలమానిని ప్రచురిస్తున్నట్లు తెలిపారు. భారతీయ వైదిక విజ్ఞానాన్ని, ఋషి పరంపరాగతమైన సనాతన సాంప్రదాయాలను, పాశ్చాత్య మోజులో కనుమరుగవుతున్న స్వచ్ఛమైన తెలుగు సంస్కృతులను పరిరక్షిస్తూ భావితరాలకు పదిలంగా అందించాలని కాంక్షతో ఉగాది తెలుగు కాలసూచి ఎన్నో వ్యయప్రయాసలకు ఓరుస్తూ స్వీయ ఖర్చులతో ముద్రించి, జిల్లా వ్యాప్తంగా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కాలసూచి యావత్ తెలుగు రాష్ట్రాలలో గొప్ప గుర్తింపు పొందినదని, ప్రతీనెల అంతర్జాల మాధ్యమంగా లక్షలాది మందికి చేరువ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ గౌరవాధ్యక్షులు గజ్జెల నర్సిరెడ్డి, కందాడి మల్లారెడ్డి, జక్కా నర్సిరెడ్డి, పాశం శ్రీశైలం, యాదగిరి, యెలసాని కృష్ణమూర్తి, రాంబాబు, నాగరాజు రెడ్డి, జక్కా ఉపేందర్ రెడ్డి, దామోదర్, రమేష్, పూర్ణచందర్, రవి రెడ్డి, చంద్రమౌళి, రాజేశ్వర్, పోచన్న, వరలక్ష్మి, జ్యోతి, శిల్ప, శైలజ, కవిత పాల్గొన్నారు.



# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనగామ నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆర్డీవో గోపీరామ్‌తో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింలు నియమనిష్టలతో ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని, వారి ప్రార్థనలు ఫలించి జిల్లా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆర్డీఓ గోపీరామ్ మాట్లాడుతూ...అన్ని మతాలకు ప్రభుత్వం సమ ప్రాధాన్యతను ఇస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగానే రంజాన్ సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం రంజాన్ మాసం పవిత్రత ప్రాశస్త్యం గురించి ముస్లిం మత పెద్దలు వివరించారు. ఇఫ్తార్ విందులో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# అండర్ పాస్ కోసం పోరాటానికి ఎస్ఎఫ్ఐ మద్దతు



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద నిర్మాణం జరుగుతున్న బైపాస్ రోడ్ లో అండర్ పాస్ బ్రిడ్జి పోరాటానికి ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా నాయకులు మద్దతు తెలిపారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి మామిడాల రమేష్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షుడు లవ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న రాథోడ్ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో రోడ్డు మూసివేసి సుమారు 10 వేల మందికి ఉపయోగపడే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం సరైన కాదన్నారు. ఇప్పటికే అధికారుల దృష్టికి ఈ విషయం తీసుక పోవడంతో పాటు అన్ని రాజకీయ పార్టీల సహకారం కూడా కోరామని, భువనగిరి నియోజకవర్గ పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి కూడా వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు. అధికారులు పట్టించుకోకుంటే దశలవారీగా అన్ని వర్గాల ప్రజల సహకారంతో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఆర్య, సందీప్, రమేష్, మానిత్ రాజ్ పాల్గొన్నారు.



# అన్ని మతాలకు సమప్రాధాన్యం

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలకు సమప్రాధాన్యం ఇస్తూ కార్యక్రమాలు చేపడుతుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రఘునాథపల్లి మండలం ఖిలషాపూర్ రోడ్డులోని కేఎన్ఎన్ ఫంక్షన్ హాల్ లో రఘునాథపల్లి, లింగాల ఘనపూర్ మండలాల ముస్లింలకు ప్రభుత్వ పక్షాన అధికారికంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా నియోజకవర్గ, రాష్ట్రంలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకొనే గొప్ప పండుగ రంజాన్ అని తెలిపారు. ముస్లింలు రంజాన్ మాసంలో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టిన ప్రతీ ఒక్కరి కోరికలు నెరవేరాలని అల్లాను ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ముస్లిం మత పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 'యుగాది' క్యాలెండర్ ఆవిష్కరణ

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి వారి ఆశిస్సులతో త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో వెలువడ్డ త్రైత శకం 47 యుగాది క్యాలెండర్ ను బచ్చన్నపేట మండల కేంద్రంలో ఎస్సై అమిద్, డిప్యూటీ తహసీల్దార్ ఫన్నీ కిషోర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరం తెలుగు క్యాలెండర్ ను ప్రతి ఒక్కరి ఇంటిలో ఉండాలన్నారు. ఈ కాలసూచికలో చాలా విశేషాల్లో భాగంగా దేవాలయం సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం, తెలుగు పండుగల విశిష్టత, తెలుగు నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకముల సారంతో పాటు ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఉన్న భగవద్గీత యొక్క సారాంశం ఇందులో పొందుపరిచి రచించారన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక జనగామ కమిటీ సభ్యుడు కొన్నే ఉపేందర్, అల్వాల రాజు, కానిస్టేబుల్ రాఖేష్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.





# అమ్మో.. మీరా..!

ఒకప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో ఆమె తోపు హీరోయిన్. స్టార్ హీరోల సరసన నటించి మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. పవర్ స్టార్ పవన్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన నటించి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది. పెళ్లి తర్వాత చాలా కాలంపాటు సినిమాలకు దూరంగా ఉన్న ఈ వయ్యారి.. ఇప్పుడిప్పుడే సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసింది. తెలుగుతో పాటు తమిళంలోనూ వరుస సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. సౌత్ ఇండస్ట్రీలో ఆమె టాప్ హీరోయిన్. అందం, అభినయంతో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. గ్లామర్ షోకు దూరంగా ఉంటూ ట్రెడిషనల్ లుక్ లో కట్టిపడేస్తుంది. ఇంతకీ ఆ బ్యూటీ ఎవరో గుర్తుపట్టారా.. ? ఆమె మరెవరో కాదు.. ఒకప్పటి తెలుగు క్రేజీ హీరోయిన్ మీరా జాస్మిన్. అప్పట్లో కుర్రకారు మనసులను దోచేసిన హీరోయిన్. అతి తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సంపాదించుకున్న వయ్యారి. తెలుగు, తమిళం భాషలలో అనేక చిత్రాల్లో నటించి మెప్పించింది. మాస్ మహారాజా రవితేజ సరసన భద్ర సినిమాతో భారీ విజయాన్ని అందుకుంది. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జోడిగా గుడుంబా శంకర్ సినిమాలో మెరిసింది. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటున్న మీరా జాస్మిన్.. ఇప్పుడిప్పుడే సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చింది. అలాగే ప్రస్తుతం సోషల్ మీడియాలో రెచ్చిపోయి గ్లామర్ ఫోటోలకు ఫోజులిస్తుంది. సినిమాల్లో నటించే సమయంలో స్కిన్ షోకు నో చెప్పిన ఈ భామ.. ఇప్పుడు మాత్రం ఓ రేంజ్ లో అందాల విందు చేస్తుంది. హాట్ హాట్ ఫొటోలతో కుర్రాళ్లకు మతిపోగొడుతుంది.